# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 27-05-2024** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **ఓట్ల లెక్కింపు ఫలితాలను త్వరితగతిన ప్రకటించేలా చర్యలు చేపట్టాలని రాష్ట్ర ఎన్నికల అధికారులను భారత ఎన్నికల ప్రధానాధికారి రాజీవ్ కుమార్ ఆదేశించారు.**

2. **రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు జూన్ 12న విద్యా కానుక కిట్లను పంపిణీ చేయనున్నామని రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ పేర్కొంది.**

3. **తిరుపతి జిల్లా చంద్రగిరి వద్ద ఈ ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు మృతి చెందారు.**

4. **తల్లి పాలను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని భారత ఆహార భద్రత, ప్రమాణాల ప్రాధికార సంస్థ హెచ్చరించింది.**

5. **భారతదేశ తొలి ప్రధానమంత్రి, స్వాతంత్ర్య పోరాటంలో ప్రముఖపాత్ర వహించిన పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ వర్ధంతి ఈరోజు.**

==========================

ఐదు దశల్లో ఇప్పటివరకు ఎన్నికలు జరిగిన రాష్ట్రాల్లో జూన్ 4వ తేదీన జరుగనున్న ఓట్ల లెక్కింపు కార్యక్రమాన్ని నిర్వహించేందుకు చేపట్టిన ఏర్పాట్లపై ఢిల్లీ నుండి దృశ్య మాధ్యమం ద్వారా భారత ఎన్నికల ప్రధానాధికారి రాజీవ్ కుమార్ ఈరోజు సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనాతో పాటు 543 పార్లమెంటరీ నియోజకవర్గాలకు చెందిన ఆయా రాష్ట్రాల ఎన్నికల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజీవ్ కుమార్ మాట్లాడుతూ, భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలను పాటిస్తూ ఖచ్చితమైన ఫలితాలను త్వరితగతిన ప్రకటించేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

--------------------------

రాష్ట్రంలో విద్యా కానుక పథకం కింద కొత్త విద్యా సంవత్సరంలో విద్యార్థులకు పంపిణీ చేయనున్న స్కూల్ బ్యాగ్‌ల సరఫరా చేసే కర్మాగారాన్ని రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ సందర్శించారు. బ్యాగుల నాణ్యతను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడుతూ, జూన్ 12న పాఠశాల కిట్‌లను పంపిణీ చేయనున్నామని పాఠశాలలు తెరిచే సమయానికి బ్యాగులు పంపిణీకి సిద్ధంగా ఉండాలని

సూచించారు. 2024–25 విద్యాసంవత్సరంగానూ విద్యార్థులకు అందజేసే వస్తువులన్నీ బ్యాగులో ఉండేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు తెలిపారు.

---------------------------

తిరుపతి జిల్లా చంద్రగిరి వద్ద ఈ ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు మృతి చెందారు. చంద్రగిరి సమీపంలోని ఎం.కొంగరవారిపల్లి వద్ద కారు అదుపు తప్పి డివైడర్ ను ఢీకొంది. ఈ ప్రమాదంలో నలుగురు మృతి చెందగా, మరో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయని, మృతులు ఒకే కుటుంబానికి చెందిన వారని పోలీసులు తెలిపారు. నెల్లూరు నుంచి వేలూరుకు వెళుతుండగా ఈ ఘటన జరిగినట్లు పోలీసులు వివరించారు. గాయపడినవారికి తిరుపతి రుయా ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నామని అధికారులు తెలిపారు.

---------------------------

తల్లి పాలను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని భారత ఆహార భద్రత, ప్రమాణాల ప్రాధికార సంస్థ –ఎఫ్ఎస్ఎస్ఏఐ హెచ్చరించింది. ఎఫ్ఎస్ఎస్–2006 చట్టం ప్రకారం తల్లి పాలను విక్రయించడానికి అనుమతి లేదని, వాటిని ఉపయోగించి చేస్తోన్న వాణిజ్యీకరణ సంబంధిత కార్యకలాపాలను వెంటనే నిలిపివేయాలని ఆదేశించింది. తల్లి పాలను శుద్ధి చేసి, విక్రయించేందుకు యత్నించే వ్యాపారులకు లైసెన్సులు జారీ చేయవద్దని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు సూచించింది. దాతల నుంచి సేకరించిన తల్లిపాలు పాల బ్యాంకుల ద్వారా నవజాత శిశువులకు మాత్రమే అందించాలని స్పష్టం చేసింది. తల్లి పాలను ఆర్థిక ప్రయోజనాలు లేకుండా ఉచితంగా స్వచ్ఛందంగా మాత్రమే దానం చేసే వీలుంటుందని ఎఫ్ఎస్ఎస్ఏఐ పేర్కొంది.

---------------------------

జూన్ 4న సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు సమయంలో ఘర్షణలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని సాయుధదళాల అదనపు ఎస్పీ రామచంద్రరాజు తెలిపారు. నిన్న పల్నాడు జిల్లా సత్తెన పల్లిలో అల్లర్ల నియంత్రణపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు సాయుధదళాలతో మాక్ డ్రిల్ నిర్వహించారు. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, ఓట్ల లెక్కింపు జరగనున్నందున ప్రదర్శనలు, అల్లర్లు, గుమికూడటంపై నిషేధం ఉందన్నారు. ఇప్పటికే శాంతిభద్రతల పరిరక్షణ దృష్ట్యా పెట్రోల్ బంకుల్లో సీసాల్లో విక్రయాలకు, పేలుడు పదార్థాలు, బాణసంచా విక్రయాలకు సైతం అనుమతి లేదని స్పష్టం చేశారు. ఓట్ల లెక్కింపు పూర్తయిన తర్వాత మరో మూడు రోజులు 144 సెక్షన్, అమల్లో ఉంటుందని తెలిపారు.

---------------------------

సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపునకు సంబంధించి ఎన్నికల అధికారులకు శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం. హరి నారాయణన్ తెలిపారు. నిన్న నెల్లూరులో కౌంటింగ్ సిబ్బందికి నిర్వహించిన శిక్షణా తరగతులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్నికల అధికారులు శిక్షణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకొని, ఓట్ల లెక్కింపునకు సంబంధించిన సందేహాలను నివృత్తి చేసుకోవాలని అన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం నిబంధనలను పాటిస్తూ సమర్థవంతంగా కౌంటింగ్ ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు.

---------------------------

భారతదేశ తొలి ప్రధానమంత్రి, స్వాతంత్ర్య పోరాటంలో జాతిపిత మహాత్మాగాంధీతో పాటు ప్రముఖపాత్ర వహించిన పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ వర్ధంతి ఈరోజు. తొలి ప్రధానమంత్రిగా దేశ పురోగతికి

ఆయన పటిష్ఠమైన పునాది వేశారు. ఈ సందర్భంగా దేశానికి ఆయన చేసిన సేవలను ప్రజలు స్మరించుకుంటూ ఘనంగా నివాళులర్పిస్తున్నారు.

---------------------------

స్థానిక ఫోన్ నంబర్లతో అంతర్జాతీయ టెలిఫోన్ కాల్స్ రాకుండా నిరోధించాలని టెలికాం సర్వీస్ ప్రొవైడర్ సంస్థలకు కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. అంతర్జాతీయ ఫోన్ కాల్స్‌కు స్థానిక నంబర్లను ఉపయోగించి సైబర్ క్రైమ్‌లతో పాటు మోసగాళ్లు ఆర్థిక నేరాలకు పాల్పడుతున్నారని టెలికాం మంత్రిత్వశాఖ ఒక ప్రకటనలో తెలిపింది. భారత్ టెలికాం సర్వీస్ ప్రొవైడర్లు ఇటువంటి అంతర్జాతీయ ఇన్ కమింగ్ కాల్స్ రాకుండా చర్యలు తీసుకోవాలని ఆ శాఖ కోరింది.

---------------------------

ఆంధ్ర–ఒడిశా సరిహద్దులోని గిన్నెలకోటకు చెందిన పెదబయలు ఏరియా కమిటీలో 13 మంది మిలీషియా సభ్యులు లొంగిపోయారని అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా పేర్కొన్నారు. పాడేరులోని జిల్లా ఎస్పీ కార్యాలయంలో నిన్న పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నిరంతర నిఘా కారణంగా పెదబయలు ఏరియాలో మావోయిస్టు ప్రభావం తగ్గిందన్నారు. వీరికి ప్రభుత్వం నుంచి ప్రోత్సాహకాలు అందేలా సహకరిస్తామని తుహిన్ సిన్హా పేర్కొన్నారు.

---------------------------

ఓట్ల లెక్కింపునకు అభ్యర్థుల, ఏజెంట్ల సహకారం కీలకమని పశ్చిమగోదావరి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సుమిత్ కుమార్ అన్నారు. భీమవరంలో నిన్న జరిగిన ఎన్నికల ఏజంట్ల సమావేశంలో సుమిత్ కుమార్ మాట్లాడుతూ జిల్లాలో ఏర్పాటు చేసిన రెండు కౌంటింగ్ కేంద్రాల్లో జూన్ 4వ తేదీన ఓట్ల లెక్కింపు కార్యక్రమం జరుగుతుందని అన్నారు. మొదట పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు అనంతరం ఏడు నియోజకవర్గాల ఈవీఎంల ఓట్ల లెక్కింపు జరుగుతుందని చెప్పారు.

---------------------------

తిరుమలలోని అంజనాద్రి జపాలి తీర్థంలో జూన్ ఒకటి నుంచి 5వ తేదీ వరకు హనుమజ్జయంతి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు తిరుమల తిరుపతి దేవస్థానం – టీటీడీ ఓ ప్రకటనలో తెలిపింది. ఆకాశగంగలోని శ్రీ అంజనాదేవి శ్రీబాలాంజనేయ స్వామి ఆలయంలో ఐదు రోజులపాటు వివిధ పుష్పాలతో అభిషేకాలు చేయనున్నామని టీటీడీ అధికారులు తెలిపారు. అలాగే జపాలిలో ప్రతిరోజూ మధ్యాహ్నం దాస సాహిత్య ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో హనుమాన్ చాలీసా పారాయణం జరుగుతుందని, హనుమంతునికి సంబంధించిన ఇతర ఆసక్తికరమైన అంశాలపై ప్రముఖ వేద పండితులచే ప్రవచన కార్యక్రమం నిర్వహిస్తామని టీటీడీ పేర్కొంది.

---------------------------

రాష్ట్రంలోని ప్రస్తుత వాతావరణ పరిస్థితులను అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం అధికారి ఎం.వెంకట్రావు కొద్దిసేపటి క్రితం ఆకాశవాణి విజయవాడ కేంద్ర ప్రాంతీయ వార్తావిభాగానికి తెలియజేస్తూ......

.....వాయిస్.... 26 సెకన్లు...

---------------------------

వేసవి రద్దీ దృష్ట్యా అనంతపురం మీదుగా రెండు ప్రత్యేక రైళ్లను నడుపుతున్నామని రైల్వే అధికారులు తెలిపారు. జూన్ 1వ తేదీ శనివారం యశ్వంతపూర్ నుంచి గయకు వెళ్ళే రైలు, అనంతపురం నుండి గుత్తి, డోన్ మీదుగావెళుతుందని, మరో రైలు యశ్వంతపూర్ నుంచి విజయవాడ మీదుగా హౌరాకు వారానికి ఒకరోజు నడుస్తుందని పేర్కొన్నారు. ఈ రెండు రైళ్లను ప్రయాణికులు వినియోగించుకోవాలని రైల్వే అధికారులు సూచించారు.

-----------------------------

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు–పీహెచ్‌సీల్లో ఒక్క ప్రసూతి కేసును కూడా నమోదు చేయని వైద్యాధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రజారోగ్య కుటుంబ, సంక్షేమ శాఖ కమిషనర్ ఎస్.వెంకటేశ్వర్ ఆదేశాలు జారీ చేశారు. ఆరోగ్య కేంద్రాల్లో ప్రసవాలు పెరగకుంటే కఠిన చర్యలుంటాయని ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రత్యేకించి గిరిజన ప్రాంతాల్లో జరిగే ప్రసవాలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. 18 ఏళ్లు నిండినవారికిచ్చే టీబీ బీసీజీ టీకాల విషయంలో గుంటూరు, విశాఖ జిల్లాలపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.

-----------------------------

తెలంగాణ రాష్ట్రంలోని పుణ్యక్షేత్రాల సందర్శనకు ప్రత్యేక బస్సు సర్వీసును ఏర్పాటు చేసినట్లు మచిలీపట్నం ఆర్టీసీ డిపో మేనేజర్ పెద్దిరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ యాత్ర ద్వారా యాదాద్రి నరసింహస్వామి దేవాలయం, చిలుకూరి బాలాజీ దేవాలయం, ముచ్చింతల రామానుజక్షేత్రం సందర్శించవచ్చని పేర్కొన్నారు.

======================